నిర్లక్ష్యం తోడైంది.. నీరు ఇంకింది

- అడుగంటుతున్న తాగునీటి చెరువులు
- యానాం నియోజకవర్గంలో పరిస్థితి
- వేసవిలో మరింత ఇబ్బందులు

యానాం: ఎండ మండిస్తుంది.. నీటి అవసరం పెరిగింది.. దాహార్తి తీర్చాల్సిన జలం అడుగంటింది.. యానాం నియోజకవర్గంలో తాగునీటి వనరుల పరిస్థితి ఇది. ప్రజలకు తాగునీరు అందించే కీలకమైన మంచినీటి చెరువుల్లో నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరింది. కొద్ది రోజులకు మాత్రమే ప్రస్తుతం చెరువుల్లో ఉన్న నీరు సరిపోతుందని, తక్షణం తమకు అదనపు జలాలను కేటాయించాలని ఇటీవల అధికారులు కాకినాడ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయడంతో ప్రమాద తీవ్రత చెప్పకనే అర్థమవుతోంది. యానాం నియోజకవర్గ పరిధిలో సుమారు 60 వేల జనాభా నివసిస్తున్నారు. యానాం రోజువారీ అవసరాలకు 13,500 క్యూబిక్ మీటర్ల నీరు అవసరం. ఈ నేపథ్యంలో నల్ల చెరువు వద్ద ఉన్న పదెకరాల చెరువుల్లో నీరు సరిపడకపోవడంతో పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని భావించారు. యానాంలో సరిపడినంత భూమి లేకపోవడంతో సరిహద్దు ఆంధ్ర పరిధిలోని సుంకరపాలెంలో 55 ఎకరాలను రైతుల నుంచి సేకరించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో భూముల బదిలీ జరిగింది. ఆ విధంగా సమాంతరంగా 20 ఎకరాల్లో 170 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల చెరువును, మరో 17


సుంకరపాలెం చెరువులో అడుగంటిన నీరు

ఎకరాల్లో 144.50 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల చెరువును పీడబ్ల్యూడీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించారు.

చెరువుల్లో నీటిని నింపకుండా..

ప్రస్తుతం యానాం నీటి అవసరాలు పూర్తిగా తీరుస్తున్న 55 ఎకరాల చెరువుల్లో సకాలంలో నీటిని నింపకపోవడం, తదితర కారణాలతో నీటి మట్టాలు కనిష్ట స్థాయికి దిగజారాయి. వేసవి కాలం వచ్చే జూన్ వరకూ ఉండే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే వచ్చే నెలల్లో తాగునీటి అవసరాలు ఏవిధంగా తీరుస్తారని స్థానికులు


55 ఎకరాల చెరువు నుంచి నల్లచెరువు, దరియాలతిప్పకు మోటార్ ద్వారా నీటి తోడకం

ప్రశ్నిస్తున్నారు. ప్రమాద ఘంటికలు మోగుతున్న నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్

లభ్యత తక్కువగా ఉంది

యానాం తాగునీటి అవసరాలు తీర్చే ప్రధానమైన రెండు చెరువుల్లో నీటి లభ్యత తక్కువగా ఉంది. దీంతో అదనపు జలాలను ధవళేశ్వరం బ్యారేజీ నుంచి విడుదల చేయాలని ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి ఆధ్వర్యంలో కాకినాడ వెళ్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించాం. ప్రజలకు సమస్య లేకుండా చూస్తాం.

– నాగరాజు, పీడబ్ల్యూడీ ఇంజినీర్, యానాం

అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను కలసి తాగునీటి ఎద్దడి తీవ్రతను వివరించి ఐదు రోజుల పాటు అదనంగా నీరు ఇవ్వాలని కోరారు.

వీటిపైనే ఆశలు

ధవళేశ్వరం ఇరిగేషన్ వ్యవస్థ నుంచే యానాంకు సైతం సాగు, తాగునీరు రావాల్సి ఉంది. ఆ విధంగా ఇంజరం బ్యాంక్ కెనాల్ నుంచి పిల్లంక వద్ద ఉన్న కాలువ మీదుగా అరటికాయలంక ద్వారా 55 ఎకరాల్లో చెరువులోకి రావాలి. రెండోది పి.మల్లవరం వద్ద ఉన్న గ్రాంటు నుంచి ఫ్రెంచ్ కాలువ మీదుగా దరియాలతిప్ప చెరువుకు చేరుకోవాలి. ప్రస్తుతం ఈ రెండు ఛానల్స్ నుంచి వచ్చే నీటి ప్రవాహం చాలావరకూ తగ్గిపోవడంతో ఇబ్బంది నెలకొంది. ప్రస్తుతం 55 ఎకరాల్లో ఉన్న చెరువుల్లో నీటిని నల్ల చెరువులోకి, దరియాలతిప్పకు మోటార్ల ద్వారా తోడుతున్నారు. ఈ రెండు చెరువుల్లో నీరు మరింత ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది.

క్లుప్తంగా

సెలవుపై విరుద్ధ ప్రకటనలతో సందిగ్ధం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ఉన్న రెండు చాంబర్స్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపారులు వారంలో ఒక రోజు తీసుకునే సెలవు దినంపై పరస్పరం విరుద్ధ ప్రకటనలు చేయడంతో ప్రజల్లో సందిగ్ధం నెలకొందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల పట్టణ ప్రజల్లోనే కాకుండా అమలాపురానికి మార్కెట్ అవసరాల కోసం వచ్చే పట్టణేతరులు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. అమలాపురం జిల్లా కేంద్రమైన క్రమంలో రెండు చాంబర్ల ప్రతినిధులు ఏకాభిప్రాయంతో స్పందించి ప్రజలు, వ్యాపారులకు అనువైన సెలవు దినాన్ని నిర్ధారించాలని బులినాని సూచించారు. ఇప్పటికే కొన్ని వ్యాపార సంఘాలు మంగళవారం సెలవు దినాన్ని పాత పద్ధతిలో అమలు చేస్తుంటే.. మరికొన్ని ఆదివారం సెలవును అమలు చేస్తున్నాయని ఆయన గుర్తు చేశారు.

విగ్రహాల ముసుగులు తొలగించాలి

తాళ్లరేవు: ఐ.పోలవరం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు ఉన్న ముసుగులను తక్షణమే తొలగించాలని విశ్వజన కళా మండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు శుక్రవారం డిమాండ్ చేశారు. కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, మాల మహానాడు అధ్యక్షుడు రేవు శ్రీను సంఘటనా స్థలాన్ని సందర్శించి విగ్రహాల ముసుగులను తొలగించాలని కోరగా, ఎస్సీ కమిషన్ గత ఏడాది డిసెంబరు 26న ఉత్తర్వులు జారీ చేసినా ఇంతవరకూ తొలగించకపోవడం దారుణమన్నారు. తక్షణమే తొలగించకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

25 వరకూ క్రీడా పోటీలు

అమలాపురం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ క్రీడలు, యువజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళలు, విద్యార్థినులకు శుక్రవారం నుంచి 25వ తేదీ వరకూ వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజయవాడ ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో పాల్గొనే మహిళలు ఫోన్ నంబరులో 79933 29433 సంప్రదించాలన్నారు.

యూటీఎఫ్ నిరసన

అమలాపురం టౌన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా యూటీఎఫ్‌కు చెందిన ఉపాధ్యాయులు అమలాపురంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. గడియారం స్తంభం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకూ ఈ ర్యాలీ సాగింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సురేంద్రకుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కారెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ముమ్మిడివరం: అన్నంపల్లి పంచాయతీ చింతపల్లిలంక శివారు ప్రాంతంలో కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం అక్కడ కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఐదుగురి నుంచి రెండు కోడి పుంజులు, కోడి కత్తులు, రూ.2,500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

15 మందిపై పిచ్చికుక్క దాడి

ఉప్పలగుప్తం: భీమనపల్లి పంచాయతీ సింగరాయిపాలెంలో ఓ పిచ్చికుక్క శుక్రవారం 15 మందిపై దాడి చేసింది. వీరంతా అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఇదిలా ఉంటే ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.

అన్ని రంగాల్లోనూ మహిళలదే పైచేయి



సమావేశంలో ప్రసంగిస్తున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియ

తాళ్లరేవు: సమాజంలో అన్ని రంగాల్లోన్లా మహిళలు పైచేయి సాధిస్తున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరంగి కైట్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శాస్త్ర–2023 ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇలక్కియ మాట్లాడుతూ రాష్ట్రంలో అక్షరాస్యత పురుషుల్లో 75 శాతం ఉంటే, మహిళల్లో 59 శాతం మాత్రమే ఉందన్నారు. కొంతమంది మహిళలు చదువు పూర్తయిన తరువాత వివాహంతో ఆగిపోతున్నారని, అలా కాకుండా ఉద్యోగం చేసి తమ కాళ్లపై నిలబడాలని అన్నారు. విద్యార్థి దశలోనే నిర్దేశిత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, ఆ లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేస్తే విజయం దానంతటదే వస్తుందని చెప్పారు. అనంతరం కళాశాల మహిళా అధ్యాపకులు, సిబ్బందిని అభినందించి జ్ఞాపికలను అందజేశారు. శాస్త్రలోని వివిధ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కైట్ కళాశాల ప్రిన్సిపాల్స్ దూబే రేవతి, యేడిద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బాలమ్మ సన్నిధిలో పూజలు


సుబ్బాలమ్మను దర్శించుకుంటున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ వారి ఆలయ పంచమ వార్షికోత్సవాలు శుక్రవారం జరిగాయి. ఆలయ చైర్మన్ బిళ్ల మల్లికార్జునరావు, ధర్మకర్తల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంతి విశ్వరూప్ దంపతులకు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆలయం వద్ద అమ్మవారి సన్నిధిలో నవచండీ హోమం, కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు వంటి క్రతువులు కన్నుల పండువగా జరిగాయి. అమ్మవారిని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్ దర్శించుకుని పూజలు చేశారు. తర్వాత అమ్మవారి గరగలతో గ్రామోత్సవం జరిగింది. ఆలయ ధర్మకర్తలు అరిగెల చంద్రశేఖర్, చప్పిడి సతీష్‌కుమార్, పందిరి సత్యసుధాకర్, శింగంశెట్టి చంద్రకళా లక్ష్మీదుర్గ, అయితాబత్తుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ

ముమ్మిడివరం: కర్రివానిరేవు పంచాయతీ శివారు చింతావానిరేవులో సుమారు రూ.50 లక్షలతో పునర్నిర్మించిన హనుమత్ సీతాలక్ష్మణ సమేత చతుర్భుజ భద్రాద్రి సీతారామస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు మంత్రోచ్చరణల మధ్య వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కాడినాడ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు, చింతా నాగమునీంద్రరావు, రేకాడి రాంబాబు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. అధిక


హనుమత్ సీతాలక్ష్మణ సమేత చతుర్భుజ భద్రాద్రి రామస్వామి

సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

అమలాపురం టౌన్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధుల బృందం కోరింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహంలో వినతి పత్రాన్ని అందజేసింది. దీనిపై స్పందించిన మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ వచ్చే కేబినెట్ సమావేశంలో పెన్షనర్లకు సంబంధించి అంశాలపై చర్చిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఈ నెలాఖరు కొన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రతినిధుల బృందం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ స్వగృహానికి వెళ్లి ఆయనకు కూడా వినతి పత్రం అందించింది. ఈ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని ఎమ్మెల్యే పొన్నాడ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడా అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం


మంత్రి విశ్వరూప్‌కు వినతి పత్రం అందిస్తున్న జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు

.సాయిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, కోశాధికారి జీఎస్ శర్మ, అసోసియేషన్ ప్రతినిధులు రంకిరెడ్డి కాశీ, ఎ.రామకృష్ణ, మహబూబ్ షహీరా, జీడీ నరోత్తమరాజు, మంత్రిప్రగడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలి


ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాల అభ్యర్థులతో అమలాపురం ఏఆర్ డీఎస్పీ విజయసారథి, డీఎం తదితరులు

అమలాపురం రూరల్: ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాల అందిస్తున్న శిక్షణ ద్వారా యువత డ్రైవింగ్‌లో మెలకువలు నేర్చుకోవాలని అమలాపురం ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి అన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపో హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 6వ బ్యాచ్‌లో 16 మందికి శుక్రవారం నుంచి తరగతులను ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ డ్రైవింగ్ శిక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ త్వరలో 7వ బ్యాచ్ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 73829 09588 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు. ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి, మెకానికల్ అసిస్టెంట్ ఇంజినీర్ జీఆర్ఎల్ దేవి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎస్.వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

మూత్రపిండాలను సంరక్షించుకుందాం


విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అమలాపురం టౌన్: మంచి ఆహార అలవాట్లతో మూత్రపిండాలను సంక్షించుకోవాలని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కాకినాడ అపోలో ఆస్పత్రి జాయింట్ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు జాగ్రత్తలను డాక్టర్ సంతోష్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని, ధూమపానం చేయకూడదని సూచించారు. 'అందరికీ కిడ్నీ ఆరోగ్యం' అనే అంశంపై అవగాహన కల్పించారు. రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో గుబ్బల సూర్యప్రకాష్, అపోలో ఆస్పత్రి డయాలసిస్ డాక్టర్ సాయికుమార్, డయాలసిస్ ఇన్‌చార్జి మేనేజర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూమికి పోషకాలు

ఉప్పలగుప్తం: రైతులు రబీలో చేలను ఖాళీగా వదిలేయడం కన్నా పచ్చిరొట్టల విత్తనాలను చల్లితే కోతల అనంతరం అవి పెరిగి తిరిగి సాగుకు దుక్కు చేసేటప్పుడు భూమికి 16 రకాల సేంద్రియ పోషకాల అందిస్తాయని మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను అధ్యక్షతన మండల వ్యవసాయ మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రబీ కోతల సమయం దగ్గర పడటంతో ఆ సమయంలో ఉపాధి పనులు నిర్వహించకుండా అధికారులు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో కుమార్‌బాబు

తీసుకోవాలని కోరారు. ఖరీఫ్‌లో ముంపునకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణ, పార్టీ మండల రైతు విభాగం అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం, రాయపురెడ్డి నాగు తదితరులు పాల్గొన్నారు.

అపరాలు అందించేందుకు చర్యలు

అల్లవరం: దాళ్వా పంట కోతల అనంతరం వరి పొలాల్లో మూడో పంట వేసేందుకు రైతులకు రాయితీపై మినుములు, పెసలు, పిల్లి పెసర విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఉండ్రు సుదర్శనరావు అధ్యక్షతన అల్లవరం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ–పంటలో నమోదు చేసిన రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల వద్ద నోటీసు బోర్డులో ఉంచామని తెలిపారు. జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ప్రస్తుతం వంతుల వారీ విధానం ద్వారా సాగునీరు అందిస్తున్నారని, మండలంలో సోమవారం వరకూ పూర్తి స్థాయిలో నీరు వస్తుందన్నారు. తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, పశు సంవర్ధక శాఖ అధికారి శివరామకృష్ణ, సభ్యులు మొల్లేటి సత్యసాయిబాబు, కోనాతి వెంకటేశ్వరరావు, రేవు సుందరరావు, నిమ్మకాయల శేఖర్, ఏఈఓ శివమోహన్ తదితరులు పాలొన్నారు.


వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

కేంద్ర విధానాలపై నిరసన

ముమ్మిడివరం: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని కాంగ్రెస్ పార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. నాయకులు పెన్మత్స జగ్గప్పరాజు, ముషిని రామకృష్ణారావు, దేవరపల్లి రాజేంద్రప్రసాద్, జె.బాబు, కడలి సత్యనారాయణ, ముషిణి లక్ష్మణరావు, గుబ్బల రవి తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన

యానాం: విద్యతోనే బాలికల ఉన్నతి సాధ్యమవుతుందని హెచ్‌ఎం బొంతు సత్యశ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం దొమ్మేటిపేట ఇసుక కాలువ సర్ ఆర్థర్ కాటన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించారు. తొలుత విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, చైల్డ్ లైన్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో యువకుడి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న 72 మద్యం సీసాలతో ఒక యువకుడిని శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ ఎస్సై ఎంవీవీబీ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఏలేశ్వరం గ్రామానికి చెందిన జీఎస్‌డీ అనిల్ కుమార్ తన బైక్‌పై యానాం నుంచి మద్యాన్ని తరలిస్తుండగా పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. మద్యం సీసాలతో పాటు బైక్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో హెచ్‌సీ ఎం.లక్ష్మణరావు, కానిస్టేబుల్స్ వీరభద్రరావు పాల్గొన్నారు.

బకాయి జీతాల విడుదల

యానాం: యానాం మున్సిపల్ ఉద్యోగులకు తొమ్మిది నెలలుగా రావాల్సిన బకాయి జీతాలకు రూ.3.53 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల బకాయి జీతాలతో పాటు విశ్రాంత ఉద్యోగుల పింఛను బకాయిలు, వివిధ ఖర్చులు ఈ మొత్తంలో ఉన్నాయన్నారు. ఇటీవల తాను చేసిన ఆమరణ నిరాహార దీక్షలో ప్రధాన డిమాండ్‌గా దీనిని ఉంచినట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వం స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు ఆధునీకరణ పనుల పరిశీలన

యానాం: దరియాలతిప్పలో రక్షిత మంచినీటి చెరువు ఆధునీకరణ పనులను శుక్రవారం ఆర్‌ఏఓ మునిస్వామి పరిశీలించారు. సుమారు పదెకరాల మేర ఉన్న చెరువు ద్వారా గిరియాంపేట, సావిత్రినగర్, దొమ్మేటిపేట, పరంపేట తదితర గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే దరియాలతిప్ప చెరువు పూర్తిగా పూడికతో నిండిపోవడంతో కలుషిత నీరు వస్తుందని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పందించి నిధులు మంజూరు చేశారు. దీంతో పూడికతీత


పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

పనులు గత కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. ఈ పనులు త్వరితగతిన పూర్తిచేసి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆర్‌ఏఓ ఆదేశించారు.